కథ

# వెండి మబ్బు

విహారి

వేసవి కాలం.
అదివారం తెలతెలవారుతోంది.
వాతావరణం ప్రశాంతంగా వుంది. కిటికీలో నుంచీ కమ్మతెమ్మెర వీస్తోంది. ప్రాణానికి హాయిగా వుంది. పక్కన పెరట్లో, మామిడి కొమ్మమీద 'కలమంత్ర పరాయణుడైన కోకిల స్వామి'.... కాకులు. నిద్రలేచి పదినిముషాలు ఈ ఆహ్లాదాన్ని అనుభవిస్తూనే ఉండిపోయాడు గోపాలం.
రాధమ్మ వచ్చింది. తూరుపు గాలిలా వచ్చింది.

అప్పటికప్పుడే అమె స్నానం, పూజ అయినాయి. కుందనపు కుంకుమ బరిణలా వుంది. హారతిలో దీపకళికలా వుంది. తదేకంగా ఆమెనే చూసిన గోపాలం అవ్యక్తమైన అనుభూతితో సన్నగా ఈల వేశాడు. 'గుడ్ మాణింగ్' చెప్పాడు. ఆమె పెదవులపై విరిసీ విరియని నవ్వుని పంచింది.

కళ్ళు చికిలిస్తూ 'లేచారా?' అంటూ, ''త్వరగా తయారుకావాలి. చిక్కడపల్లి వెంకటేశ్వ రాలయంలో కళ్యాణం చెప్పాను. టికెట్ రెడీ. ఎనిమిది, ఎనిమిదిన్నరకి వెళ్లాలి. అదీ ఇవ్వాళ మన మొదటి కార్యక్రమం'' అంది.

''ఏం విశేషం?'' కొంచెం ఆశ్చర్యంతోనే అడిగాడు.

''పెళ్ళిరోజు శుభాకాంక్షలు. పాతికేళ్ళు...'' అని చేయి కలిపింది.

''థాంక్యూ... మీకూ అవే... అవే'' హుషారుగా అన్నాడు.

రాధమ్మ నవ్వింది. కళ్లు మిలమిలా మెరిశాయి. ఇందాకటి కన్నా కూడా ఎంతో బావుంది అనుకున్నాడు గోపాలం. అందమైన భార్య అనిపించిన ఆత్మముగ్ధత్వం మనసుని పరవశింపచేసింది.

గాలికి ఊగిన జలతారు తెరలా కదిలి, కదిలి వెళ్లింది రాధమ్మ.

గోపాలమూ కదిలాడు.

కళ్యాణం కార్యక్రమం ముగిసి ఇంటికి వచ్చే సరికీ పదకొండున్నర అయింది. దారిలో ఆటోలో చెప్పింది రాధమ్మ, ''ఈ రోజల్లా మీరు నా కంట్రోల్‌లో ఉంటారు. నేనేం చెప్తే అది వింటారు, నేనేం చెయ్యమంటే అది చేస్తారు. నో అడ్డు ప్రశ్నలు...నో ఎంక్వయిరీలు!''

క్షణంసేపు నివ్వెరపోయి, తెప్పరిల్లి ''ఓకె... ఓకె..'' అన్నాడు గోపాలం. ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు సరదాగా.

ప్రసాదం తిని ఆనాటి పేపర్ తీశాడు గోపాలం. వంటింట్లో నుంచే మందలింపుగా అన్నది రాధమ్మ ''ఈ రోజు నో పేపర్ రీడింగ్. మనసు పాడుచేసు కోకూడదు. తీసేయండి''

''వామ్మో...చాలాదాకా వుందే ఆర్డరు...'' అని మురిపెంగా మనసులో అనుకుని, పైకేమో ''ఐ లైకిట్'' అన్నాడు. ఏదో ఇంద్రజాలానికి లోనైన వాడిలా ఠక్కున పేపర్‌ని పక్కని పడేసి ''చిత్తం... చెప్పండి'' అన్నాడు కొంటెగా.

''చెప్తాం...చెప్తాం..'' అంటూ ఇద్దరికీ కాఫీ కప్పులతో వచ్చి కూర్చుంది. భర్తకిచ్చి, తానూ సిప్ చేసింది. ''మన తదుపరి కార్యక్రమం తాజ్‌లో లంచ్'' అన్నది.

గోపాలం ఆశ్చర్యంలో వుండగానే రూఢీ చేస్తూ ''యస్'' అన్నది దృఢంగా.

ఒక ఆనందమయ ప్రపంచంలో పడ్డాడు గోపాలం. తాజ్‌లో లంచ్! ఎన్నాళ్లయిందో? కాదు, ఎన్నేళ్లయిందో? యవ్వనంలో, ఉద్యోగం కొత్తల్లో, ఫైలాపచ్చీస్ రోజుల్లో అక్కడ భోజనం తనలాంటి ఒంటరిగాళ్లకు పెద్దక్రేజ్. ఆ రోజులే వేరు. లోకమంతా పూచిన రోజ్ గార్డెన్‌లా వుండేది. క్షణంలో తేరుకుని ఏమనాలో తెలీక

''గుడ్... గుడ్..'' అనేశాడు అభినందనగా.

అనురాగ దృష్టితో అతన్ని చూసి, కొమ్మలా ఊగుతూ ఖాళీ కప్పులతో లోపలికి నడిచింది రాధమ్మ.

గోపాలం ఆలోచనలు రత్నశలాకలాంటి రాధమ్మ మీదికీ, పాతికేళ్ల క్రితం జ్ఞాపకాల మీదికీ మళ్లినై. ఆ గొలుసుకట్టుతో కొన్ని నిముషాలు గడుపుతూ కుర్చీలో అలాగే వెనక్కి వాలాడు.

అతని స్మృతి దృశ్యాలకి కట్ చెప్తూ వచ్చేసింది ఈ ఎపిసోడ్ దర్శకురాలు రాధమ్మ. పట్టుచీర మార్చుకొని కాటన్‌లో కొచ్చేసింది. ''లేచి తయారుకండి'' అంటూ పూలు కట్టుకుంటూ కూచుంది.

మరో పావుగంటలో హోటల్‌కి కదిలారు.

బయల్దేరబోతుండగా ఫోన్ మ్రోగింది. గోపాలం రిసీవర్ అందుకోబోతుంటే, వారించి తానే తీసింది రాధమ్మ. అవతల నుంచీ కోటేశ్వ ర్రావ్, గోపాలం చెల్లెలు సుకన్య భర్త. బావగారు లేరని సమాధానం చెప్పి, తర్వాత మాట్లాడమంది. రేపు ఫోన్ చెయ్యమంది.

గోపాలం శ్రోతగా, ప్రేక్షకుడిగా ఉండి పోయాడు.

ఏ. సి. హోటల్లో భోజనం చేసి ఇంటికొచ్చారు.

భోజనమిచ్చిన తృప్తితో చెమ్మ ఉరిసిన నీటి కూజాలా ఉన్నాడు గోపాలం. వేట నుంచీ గుహ కొచ్చిన సింహంలా ఉన్నాడు. భుక్తాయాసంతో కొద్దిగా మాగన్నుగా పడుకున్నాడు.

ఎయిర్ కూలర్ పెట్టి కర్టెన్లు వేసింది రాధమ్మ తాను హాల్లో పాత 'మిస్సమ్మ' సినిమా పెట్టుక్కూ చుంది. పగటినిద్ర ఆమెకి అలవాటు లేదు.

గోపాలంకి కునుకు పట్టేసింది. గంటపైనే గడిచింది.

తలుపు దగ్గర అలికి డయితే లేచి వెళ్లి చూసింది రాధమ్మ.

జగన్నాథం, వాళ్లా విడ సరసమ్మ!

లోపలికి ఆహ్వానించింది. వచ్చి కూచున్నారు. మంచినీళ్లిస్తూ చచ్చానురా భగవంతుడా అనుకుంది మనసులో. యోగక్షేమాలు, అందరూ కబుర్లలో పడ్డారు. వాళ్లిద్దరూ చాలా రికామీ మనుషులు. వయస్సు డెబ్భై పైమాటే. బాధ్యతలు అయి పోయాయి. ఇద్దరూ కలిసి బంధువుల ఇళ్లకి శుభాశుభాలకన్నింటికీ తిరుగుతూ వుంటారు. పిలవని వాళ్లది పాపం...అని కొందరు జోక్ చేస్తూ ఉంటారు. ఎవరో స్నేహితుడి మనవరాలి పెళ్లిట రేపు. దానికి వచ్చారు. సినిమా ఆపి కూర్చుంది రాధమ్మ.

జగన్నాథం గొంతు పెద్దది. గలగలా మాట్లాడతాడు. ఆయన మాటలకి గోపాలం నిద్ర లేచాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ కూచున్నారు. టీ అయింది.

ఐదవుతుండగా జగన్నాథమూ, సరసమ్మా సెలవు తీసుకుంటూ కదిలారు.

ప్రాణానికి హాయి అనిపించి 'హమ్మయ్య' అనుకుంది రాధమ్మ.

వెళ్తూ వెళ్తూ ''ఒరేయ్ గోపాలం ఇవ్వాళ మీ పెళ్లి రోజు కదరా. నాకు గుర్తుంది. శుభాకాంక్షలు- ఇద్దరికీ'' అని ''అందుకనే మా బసని ఆ చంద్రం గాడింట్లో పెట్టాను'' అని సన్నగా నవ్వాడు. చంద్రం ఆయనికి దూరపు చుట్టం.

వాళ్లని సాగనంపి వచ్చాడు గోపాలం.


వాతావరణం బద్ధకంగా చల్లబడుతోంది. గాలిలో వేడి పూర్తిగా తగ్గలేదు.


సినిమాని మళ్లీ ఆన్ చేసింది రాధమ్మ.

చూస్తూ కూచున్నారు.

ఆరవుతుండగా అయిపోయింది సినిమా.

ఫోన్ మ్రోగింది. రాధమ్మే చూసింది. ఆమెకి ఎవరి నుంచీ ఏ వార్త వచ్చి తన ప్రోగ్రామ్‌ని చెడగొడుతుందో అని భయం.





ఫోన్ వచ్చిందన్నా, ఎవరన్నా వచ్చారన్నా మనసులో బితుకు బితుకుమంటోంది.

గోపాలం కోసం ఎవరో ఆఫీస్ వ్యక్తి, చెప్పింది. అతను వెళ్లి మాట్లాడాడు. ఆ కాల్ కాగానే అన్నది రాధమ్మ. ''మీరు వెళ్లి స్నానం చేసి తయారుకండి. చెప్తాను''

భార్య పురమాయిస్తున్న పనులకి ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ వుంది గోపాలంకి. తదుపరి కార్యక్రమం గురించి వివరాలడిగే సాహసం మాత్రం చేయడం లేదు. 'అంతయూ మన మేలునకే' సూత్రం మననం చేసుకుంటూ, 'చిత్తం దేవీ' పఠిస్తున్నాడు.

ఆ తర్వాత అర్ధగంటలో భార్య ఉద్దేశ్యం బోధపడింది గోపాలంకి.

ఆటో ఎక్కి ''బెల్‌సన్ తాజ్‌కి పోనీ'' అన్నది.

రిక్షాలో పోతుంటే గోపాలం బుర్రలో వేల ఆలోచనలూ, అవి కల్పించిన వందలకొద్దీ ప్రశ్నలూ జెట్ స్పీడ్‌లో పరిగెత్తసాగాయి. అవన్నీ ఒక కొలిక్కిరాక బుర్రలోనూ, బయటా కూడా ట్రాఫిక్ జామ్‌ని సృష్టించాయి.

శ్రీమతి రాధమ్మ అనే ఈ 'లవ్లీడెవిల్' తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ఆమె చేతిలోకి తీసుకుని ఒక ఆటాడిస్తున్నందుకు- రాని తుమ్ములా ఇబ్బందిగానూ, అనుభవైకవేద్యమైన హాయిగానూ ఉంది గోపాలంకి!

హోటల్ రెస్టారెంట్‌లో,

ముందుగా గోపాలంకి ఎంతో ఇష్టమైన మిక్స్‌డ్ వెజిటబుల్ సూప్‌ని ఆర్డర్ చేసింది రాధమ్మ.

''ఐ యామ్ ఆల్‌రెడీ ఇన్ సూప్ మేమ్'' అని జోక్ చేశాడు.

కనువిందుగా మృదుహాసం చేసి ''యా...ప్లీజ్ బేర్ విత్ మీ సర్'' అని భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని అరచేతిని మృదువుగా నొక్కింది రాధమ్మ.

గోపాలం నరాలు జివ్వుమన్నాయి. మోయలేని ఒక హాయితో ప్రాణం తేలిపోయింది. అతనికి తన అనుభూతి పారవశ్యాన్ని గురించి ఎన్నో మాటలు చెప్పాలని ఉంది. కానీ అనిర్వచనీయమైన భావాలు గొంతుకని పెగలనీయలేదు. ఆరాధనా భావంతో ఆమె వైపు చూస్తూ ఉండిపోయాడు.

భోజనం అయింది.

దారిలో పండ్లూ, స్వీట్‌లూ కొన్నది రాధమ్మ. ఒక అర్ధకిలో స్వీట్ కాజూ కూడా తీసుకుంది. గోపాలంకి అదంటే ప్రాణం.

ఇంటికి వచ్చేసరికి పదయింది.

కొద్దిసేపు బెడ్‌రూమ్ అలంకరణలో నిమగ్నమయింది రాధమ్మ. అగరొత్తులు వెలిగించి, కూలర్ ఆన్ చేసింది. టేప్ రికార్డ్‌లో మంద్రస్థాయిలో టి.యస్. కృష్ణన్ వయొలిన్ పెట్టింది. గోపాలం ఆ కేసెట్ లోని పాటలంటే చెవికోసుకుంటాడు.

ఆ రాత్రి-

వీరిద్దరూ కలిసి ఆ రాత్రిని శృంగారమయం చేసుకున్నారా లేక రాత్రే రసరాగజలధిగా మారి వీరిని ఆనందకల్లోలంలో ముంచి తేల్చిందా అనేది-కవుల సమస్య! ఇద్దరి దేహాంతః కరణల్లోని రహస్యాలన్నీ విపులీకరణం చెంది ఉద్వేగంలో ఉత్తేజితమైపోయాయి.

కాలస్పృహ తేలిపోయింది!

***

భళ్లున తెల్లవారింది.

# అయాన్ రాండ్‌కు తగ్గని ఆదరణ



మందులకి, టానిక్కులకీ ఉన్నట్టే చాలా మంది రచయితలకీ ఒక ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. ఒక సమయంలో పాఠకుల్ని తమ వినూత్న భావజాలంతో ఆకట్టుకున్న రచయితలు కాలక్రమేణా నూతనత్వాన్ని కోల్పోతారు. కొన్ని సందర్భాల్లో, ఒకప్పటి వారి నూతన భావజాలం ఇప్పుడు పిడివాదంగా కూడా మారి పోతూంటుంది. చాలా తక్కువ మంది రచయితలే ఇలా కాలానికి చెల్లిపోకుండా తమ ప్రభావాన్ని నిలబెట్టుకునేది. అలాంటి అరుదైన రచయితల్లో ఒకరు అయాన్‌రాండ్. మానవ కళ్యాణానికి తప్పనిసరిగా అవసరమైన సిద్ధాంతంగా సామ్యవాదం చాలా ప్రచారంలో ఉన్న కాలంలోనే దానికి వ్యతిరేకమైన పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించిన రచయిత్రి. ఆమె తన రచనల ద్వారా పెట్టుబడిదారీ విధానానికి ఒక సిద్ధాంతపరమైన ప్రాతిపదికను కూడా ఏర్పాటు చేయగలిగింది. చిన్నతనంలోనే రష్యాలోని కమ్యూనిస్టు ప్రభుత్వ నిరంకుశ పాలన వల్ల తన కుటుంబం అష్టకష్టాలపాలవడం చూసిన అయాన్ రాండ్ కమ్యూనిజంపై ద్వేషం పెంచుకుంది. ఇరవైయ్యొక్కేళ్ళకే పారిపోయి అమెరికా వచ్చేసింది. అప్పటి వరకూ సరైన ఇంగ్లీషు కూడా రాని అయాన్ రాండ్ మరో పదేళ్ళకే ఇంగ్లీషులో నవలలు రాసే స్థాయికి ఎదిగింది. ఫౌంటెన్ హెడ్, అట్లాస్ ష్రగ్డ్ లాంటి నవలలతో సంచలనం సృష్టించింది. ఆబ్జెక్టివిజమ్ అనే తనదైన తాత్త్వికి సిద్ధాంతానికి రూపకల్పన చేసింది. హేతువు, స్వార్థం, స్వేచ్ఛా వాణిజ్యం- ఈ మూడు ముఖ్య మూల స్తంభాల ఆధారంగా ఏర్పడిన ఈ ఫిలాసఫీకి, ఈ ఫిలాసఫీ ఆధారంగా రచించిన ఆమె నవలలకు ఆదరణ రాను రాను పెరుగుతోందే కాని తగ్గటం లేదని ఇటీవలి సర్వే తేల్చిచెప్పింది. ఫౌంటెన్ హెడ్‌లాంటి ఆమె నవలలు విడుదలై అరవై సంవత్సరాలు పైబడినా అవి ఇప్పటికీ లేటెస్టు బెస్ట్ సెల్లర్స్‌తో పోటీగా అమ్ముడుపోతున్నాయట. ఆమె నవలల్లోని హోవర్డ్ రోర్క్, జాన్ గాల్ట్ మొదలైన కథానాయకులను ఇప్పటి యువతలో కూడా చాలా మంది మార్గదర్శకులుగా భావిస్తున్నారట. అమెరికాలోనైతే ఆమె నవలలు బిజినెస్ కోర్సులలో పాఠ్యాంశాలుగా కూడా ప్రవేశపెట్టారు. ఈమె నవలలు బాగా అమ్ముడు పోతున్న దేశాల్లో ఇండియా రెండోస్థానంలో ఉండటం మరో విశేషం.

అప్పుడప్పుడే బద్ధకంగా కళ్లు తెరుస్తున్నాడు గోపాలం.

వేడిసెగలా తాకుతూ వచ్చేసింది రాధమ్మ ''లేవండి, లేవండి. మీ అమ్మగారూ పిల్లలూ వచ్చేస్తున్నారు. నన్ను కట్టుకు పోయినన్ని పనులున్నై. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి, బుక్స్ కొనాలి, డ్రెస్‌లు తీయాలి. పెద్దదానికే సుమారు పదివేలవుతాయన్నారు. ఏం టెన్తో ఏమో? మీ సుపుత్రుడుకీ, రమకీ ఎంత లేదన్నా నాలుగైదు వేలు కావాలి. ఆ పర్సనల్ లోన్ సంగతి ఇవ్వాళ తేల్చండి''

గలగలా మాట్లాడేస్తోంది.

''అన్నట్టు మీ అమ్మగారు రాగానే అడుగుతారు- సుకన్యని పురిటికెప్పుడు తీసుకువద్దాంరా అని. ఆ పిల్లకిప్పుడు ఏడోనెల. మీ బావగారు ఫోన్ చేశారు కదా నిన్న? ఆయన ఇండెంటేంతో ఏమిటో?''

కలనుంచీ ఇలమీదపడినట్లు కళ్లు విప్పుకుని భార్యకేసి చూశాడు గోపాలం.

నిన్న రోజంతా తన మనసుని మధురానుభూతితో ఉయ్యాలలూపిన రాధమ్మ ఈమేనా అనిపించింది. కదిలి వెళ్లబోతున్న ఆమె చెయ్యి పట్టుకుని మంచం మీదికి లాక్కుని ''అవునోయ్ ఈతిబాధలన్నిటినీ, బాధ్యతలనన్నిటినీ గుర్తు చేస్తున్నావ్‌గానీ...నిన్న అంత ఖర్చు....?'' అని నీళ్లు నములుతూ ఉత్సుకతతో అడిగాడు. తల చిత్రంగా తిప్పి, కనుబొమలెగరేశాడు చెప్పమన్నట్టు.

భర్త చూపుల్లో చూపు నిలిపి అన్నది రాధమ్మ, ''కొన్ని జ్ఞాపకాల్ని గుండెల్లో మధురంగా దాచుకోవాలి. మన జీవితాల్లో అవే చీకట్లో చీలికలు. మా పిన్ని అంటూ వుండేది 'ఖర్చులో ఖర్చు' అని అంతే''

గోపాలంకి బోధపడని సత్యంలా తోచాయామె మాటలు. ఆయోమయంగా చూశాడు.

ప్రక్కింటావిడతో ఏదో టీవీ స్టూడియోకి వెళితే, అనుకోకుండా అక్కడ ఆడియన్స్ క్విజ్‌లో తనకు వచ్చిన రెండువేలు సంగతి రాధమ్మకు తప్ప ఎవరికీ తెలియదు.

హాల్లో టీవీ ఛానెల్ అరుస్తోంది- 'పెట్రో మంటలు- మధ్యతరగతి తంటాలు' అని. వాస్తవం ఎప్పుడూ చేదుమాత్రే!

భార్యాభర్తలిద్దరూ ఉలిక్కిపడి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

కథాంతాన్ని స్పష్టం చేస్తూ ఠక్కున కరెంటు పోయింది. పిల్లలూ, గోపాలం తల్లీ లోపలికొస్తున్నారు!!!

*

